స్కెచ్

# అనుమాన ప్రమాణం

'హితశ్రీ'

హైస్కూల్ వార్షికోత్సవ సందర్భంలో ఆటల పోటీలు పెట్టి గెలిచిన వాళ్ళకి బహుమతు లిస్తున్నారు. ఈ బహుమతులు తమ చేతుల మీదుగానే ఇవ్వటానికి డిప్యూటీ సూపరింటెండెంటు దొరవారు దయతో అంగీకరించారు. ఆటలమీద తమకెంత ఆసక్తి ఉన్నదీ, అందరికీ ఎంత ఉండవలసిందీ స్పష్టంగా చెప్పేసి దొరవారింకా ఇలా అన్నారు-

"మనదేశంలో కమ్యూనిస్టు ప్రమాదం మహా ఉద్ధృతంగా ఉంది. కమ్యూనిస్టుల్ని మొదలంట నాశనం చేయాలంటే మీరందరూ మాతో సహకరించాలి. మీరు భావి భారతపౌరులు; వారసులు. కమ్యూనిస్టుల్ని ఎదుర్కోటానికి మీరంతా శక్తివంతంగా తయారు కావాలి. కమ్యూనిస్టుల్ని—"

ఉపన్యాసం శ్రద్ధగా వినే ఓ కుర్రవాడికి "కమ్యూనిస్టు" అంటే ఎవరా అని ధర్మసందేహం కలిగింది. నిర్భయస్థుడు కావటంచేత అడిగేశాడు ధైర్యంగా. "కమ్యూనిస్టు అంటే ఎవరండీ?" "కమ్యూనిస్టు" అంటే అర్థం తెలియకపోయినా ఆ పదాన్ని చాలాసార్లు విన్న కుర్రాళ్లు అతడి వైపు ఆశ్చర్యంగా చూశారు. హెడ్ మాస్టరు గారు భీకరంగా చూశారు; దొరగారు కొంచెం కోపంగా చూశారు. దొరగారికి సమాధానం వెంటనే దొరకలేదు. కమ్యూనిస్టు అనే పదానికి నిర్వచనం కంఠస్థం చేయనందుకు కాసేపు విచారపడి, ఇంతలో ఏదో స్ఫురించగా దొరగారిలా అన్నారు-

"కమ్యూనిస్టంటే ఎర్రజండా పట్టుకు తిరిగే వాడు. కాబట్టి మీరు ఎర్రజండా వాళ్ళని చూడటం తటస్థిస్తే వెంటనే వాళ్లు కమ్యూనిస్టులనీ, దేశానికి పరమ శత్రువులనీ గ్రహించుకోండి. మీకో ముఖ్యవిషయం చెబుతున్నాను. ఈ చుట్టుపక్కల ఉన్న కమ్యూనిస్టు లందర్నీ ఎక్కడున్నారో వెతికి, కమ్యూనిజాన్ని సమూలంగా నాశనం చేసేదాకా నేను నిద్రపోను. ఈ ప్రయత్నంలో మీకు కొన్ని ఇబ్బందులు కలుగవచ్చు. (దొరగారు తాము మాట్లాడేది పిల్లలతోనని మర్చిపోయినట్టున్నారు.) కాని మీరు ఓర్పువహించి ప్రభుత్వంతో సహకరించాలి." హెడ్ మాస్టరు గారు చప్పట్లు చరవటం చూసి పిల్లలంతా దిక్కులు పిక్కటిల్లేలా కరతాళధ్వనులు చేశారు. దొరగారు గర్వంగా కలయచూసి కారువైపుకు నడిచారు.

దొరగారు చెప్పిందాంట్లో ఏమీ అతిశయోక్తి లేదు. అక్షరాలా తమ విధానాలు అమలు పరుస్తున్నారు కమ్యూనిస్టుల్ని గాలించటానికి. అవి ఎంతవరకు ఫలిస్తున్నాయీ అనేది వేరే సంగతి.

పక్కఊళ్లో పనిఉండి ఓరోజు తెల్లవారు జామున బయలుదేరాను. సగందూరం వెళ్ళాను. చీకటి ఇంకా బాగా వుంది. రోడ్డుమీద నేను తప్ప మరోప్రాణి నడవటంలేదు కనుచూపు మేర దూరంలో. దూరంలో లైట్లు కనపడుతున్నాయి... పోలీస్ వాన్ వొస్తోంది. నా దగ్గరికి ఒచ్చేసరికి తపీమని ఆగింది వాన్. ఓ పోలీసాయన (ఇన్‌స్పెక్టరు కాబోలు) అడిగాడు—

"ఎవరు మీరు?"

"సివిలియన్"

"ఎక్కడికి పోతున్నారు?"

"పక్క ఊళ్ళోకి"

"మీ పేరు?"-చెప్పాను.

"ఇంత చీకట్లో బయలు దేరాలిసిన అవసరం ఏమిటి?"

"పొద్దెక్కకముందే చేరదామని"

"చేతిలో ఆ పుస్తకం ఏమిటి?"

చచ్చాను- పుస్తకానికి ఎర్రట్ట ఉంది.

"దేశం బాగుపడాలంటే అనే పుస్తకం"

"హమ్మా-దయచేయండి లోపలికి..."

"ఏమిటి మీ అభిప్రాయం?"

"ఎక్కువయ్యా వాన్" రెక్క పట్టుకు లోపల కూర్చోపెట్టాడు పోలీసాయన.

* * *

ఇందాక మీకు ఓ విషయం చెప్పడం మర్చిపోయాను. సూపరింటెండెంటుతో నాకు కాస్త పరిచయం ఉంది. ఆయనా, నేనూ ఒక కాలేజీలోనే చదివాం. మా పక్కరూములో ఉండేవాడు.

"మరోలా అనుకోకండి. ఏం చేస్తాం చెప్పండి. తప్పని సరి." అన్నాడాయన ఓదార్పుగా ట్రాక్ పోలీసు స్టేషన్‌లో.

"ఫరవా లేదులెండి. కాని మీకు కోపం రాకపోతే ఓ సంగతి అడుగుతాను."

"ఏమిటి?"

"రోడ్డుమీద పోలీస్ వాన్ తిరగడం ఎందుకు?"

"కమ్యూనిస్టుల్ని పట్టుకోడానికి - అదో విధానం."

"రోడ్డుమీద కారేసుకు పచార్లు చేస్తే కమ్యూనిస్టులు దొరుకుతారనా మీ ఉద్దేశం? దాక్కోదలచిన వాళ్లు బహిరంగంగా తిరుగుతారా ఏమిటి?"

"మీకు తెలియదు- వాళ్లకి తెగింపు జాస్తి."

"అలా అయినా-పోలీస్‌వాన్ చూసికూడా, కొరవిదయ్యాల్లాంటి ఆ హెడ్ లైట్లు రెండు ఫర్లాంగులదూరంలో చూసి కూడా ఎదురుగా వచ్చే మూర్ఖులా వాళ్లు?"

సూపరింటెండెంటు మాట్లాడలేదు.

"రోడ్డుమీద పోయే ప్రతివాళ్లనీ కమ్యూనిస్టని అనుమానించడం చూస్తే నవ్వొస్తుంది. చచ్చి చెడి సగందూరం నడిచాను. కాళ్లనొప్పులే కాక పనికూడా చెడ్డది మీ పోలీసువాళ్ళ అతి తెలివివల్ల." కోపంతో అన్నాను.

"తప్పని సరి — పరిస్థితులలాంటివి."

"ఆధారాల కంటె కమ్యూనిస్టుల కుండవలసిన లక్షణాలు వల్లించి అవి చూచాయగా ఎవరిదగ్గరైనా ఉంటే వాళ్ళని అరెస్టు చెయ్యటమో, నిర్బంధించటమో చూస్తే కోపం పోయి నవ్వొస్తోంది. పౌరస్వత్వాలకి విలువ ఏముంటుంది ఇహ?"

"ఇప్పు డిలాగే అంటారు. రేపు వీళ్ల ఉపద్రవం మరీ ఎక్కువైతే పోలీసు డిపార్టుమెంటు కుంభకర్ణుడితో పోటీ చేస్తోందా అంటారు?"

"ఏమయినా అనండి - తగినంత ఆధారం లేకుండా కేవలం అనుమానంమీద నిర్బంధాలు జరగటం ఉచితం కాదు."

ఆయన నిర్లక్ష్యంగా నవ్వి అన్నాడు.

"పోనిద్దురూ ఈ గొడవలు - కాస్త చిన్నప్పటి కబుర్లు చెబుదురూ - మిమ్మల్ని ఇన్నాళ్ల తర్వాత చూస్తే కాలేజీ జీవితం అంతా కళ్లకు కట్టినట్టుంది."

"ఏమిటో ఆరోజులు-" ఇద్దరమూ నిట్టూర్పు విడిచాం. కాసేపు మాట్లాడిన తర్వాత ఆయన అన్నాడు.

"సాయంత్రం ఓ సారి కనిపిస్తావు గదూ - కాస్త అలా తిరిగి వొద్దాం. ఈ ఆఫీసు పనితో మరీ చిరాగ్గా ఉంటోంది."

తల ఊపాను.

* * *

కబుర్లు చెప్పుకుంటూ ఊరుపొలిమేర దాటాం ఇద్దరమూ. బాగా చీకటిపడ్డది. మాటలసందడిలో టైం తెలియలేదు. తీరా టైంచూసేసరికి తొమ్మిదయింది. వెనక్కి తిరిగాం. హెడ్ లైట్లు మెరిశాయి. పోలీస్‌వాన్ వొస్తోంది. దగ్గరగా వొచ్చి తటాలున ఆగింది. లోపల రిజర్వుదళం ఉంది.

"ఎవరు!" అధికార స్వరంతో అన్నాడు పోలీసాయన.

"సివిలియన్" అన్నాను. సూపరింటెండెంట్ మాట్లాడలేదు. ఆయన సాదాదుస్తుల్లో ఉన్నాడు.

"మీరు, మాట్లాడరేం!"

"సివిలియన్" అన్నాడు. ఆశ్చర్యంగా చూశాను ఆయన వైపు. చిన్నగా నవ్వాడు.

"ఇక్కడేం చేస్తున్నారు ఇంత చీకట్లో?"

"ఏమీ లేదు" అన్నాడు సూపరింటెండెంటు.

పోలీసు అధికారి మమ్మల్ని పరకాయించి చూశాడు.

"మేం కమ్యూనిస్టులం కాదు" అన్నాడు సూపరింటెండెంటు.

"ఆకారాలు చూస్తే కమ్యూనిస్టుల్లాగే ఉన్నారు - తడబడుతున్నారు కూడా-" అని నెమ్మదిగా ఇంకో పోలీసాయనతో సంప్రదించాడు.

"మీరు కమ్యూనిస్టులు కాదనటానికి ఆధారాలు ఏమిటి?" తీవిగా అడిగాడు పోలీసు అధికారి.

"నాకు మార్క్స్ అనే పదానికి అక్షరక్రమంకూడా తెలియదు" అన్నాను.

"మేం కమ్యూనిస్టులం కాకపోవటమే ఆధారం" అన్నాడు సూపరింటెండెంటు మొండిగా.

"చాలాదాకా ఉందే, సోదా చెయ్యవోయ్."

సూపరింటెండెంటు జేబులోంచి ఒక కరపత్రం తీశారు బయటికి. "కమ్యూనిజం అరికట్టండి" అని పెద్ద అక్షరాలతో ఉంది దాని మీద.

"ఇంకా అనుమానం ఎందుకు? మిగతా కాగితాలుకూడా ఇక్కడే దాచి ఉంటారు ప్రజలకి అందకుండా. దయఉంచి వాన్ ఎక్కండి స్వామీ" ఎగతాళిగా అన్నాడు.

"మమ్మల్ని అనవసరంగా బాధిస్తున్నారు" అన్నాడు సూపరింటెండెంటు.

"నిర్దోషులైతే తెల్లవారింతర్వాత క్షేమంగా ఇళ్లు చేరుకోవచ్చు-ఎక్కండి."

నేను మర్యాదగా ఎక్కాను. సూపరింటెండెంటు, సరదాగా ఉంది కాబోలు, రెక్కపట్టి లాగించుకున్నాడు. స్టేషన్ సమీపించాం. దిగాము. పాపం, సర్కిల్ ఇంకా పని చేస్తూనే ఉన్నట్టున్నాడు. చూట్టానికి వచ్చాడు కమ్యూనిస్టు నిర్బంధితుల్ని! "వీళ్లే సార్" అన్నాడు పోలీసాయన. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అదిరిపడి నిటారుగా నుంచుని సెల్యూట్ చేశాడు డిప్యూటీ సూపరింటెండెంట్‌కి. రిజర్వు దళం నోరు తెరుచుకు చూసింది. రెక్కపట్టుకు లాగిన పోలీసాయన దడదడలాడి కుప్ప కూలాడు. "దొరగారు!" తమలో తాము గొణిగారు రిజర్వు పోలీసువాళ్లు. లోపల కూర్చున్నాం. "ఈ సాయంత్రమే వచ్చింది ఈ రిజర్వు దళం. పాపం, గుర్తు పట్టలేదు."

నేను మాట్లాడకుండా జేబులోంచి ఓ పావలా తీసి బల్లమీద పెట్టాను. ఆయన ఆశ్చర్యంగా చూశాడు.

"నరకబాధ తప్పించినందుకు ప్రతిఫలం-గవర్నమెంటుకు ముట్టచెప్పండి దయచేసి."

గట్టిగా నవ్వేశాడు సూపరింటెండెంటు. నేనూ నవ్వాను.

"మరి పొద్దున ఇవ్వలేదేం?"

"పొద్దున నా గమ్యస్థానం వేరు" - మళ్ళీ నవ్వాడు.

కానీ సాగి అన్నాను. "బహుశా ఇప్పుడు తెలిసి ఉంటాయి మీకు మా అగచాట్లు."

"ఇదివరకు తెలియవనా మీ రనేది?"

"అది కాదు. అనుభవంలోకి వస్తేగాని-"

"అక్కడే పొరపడుతున్నారు. మా విధానాల ఫలితాలు మాకు పూర్తిగా తెలుసు-కాని గత్యంతరం లేదు. నన్ను నిర్బంధించకపోతే నేను తప్పక చర్య తీసికొనేవాణ్ణి. మా డిపార్టుమెంటులో అనుమానం లేకపోతే పని జరగదు."

"అనుమానించి ఆధారాలు తీరిగ్గా వెదకడం నేను ఒప్పుకోను- క్షమించాలి."

"మీ అనుభవాలు మాకు తెలుసు, కాని మా అనుభవాలు మీకు తెలియవు. బయటినుంచి కబుర్లు చెబుతారు మీరు, మీరు ఈ ఉద్యోగంలో ఉంటే ఇలాగే చేసేవారు."

"నేను అలా ఊహించలేను."

"అవును. మీవి వట్టి ఊహాలే. మా ఊహాలు కార్యరూపం దాల్చాలి. ఫలితం మీది, బాధ్యులం మేము."

"మీ రేమనుకోకపోతే, పోలీసువాళ్ళ ప్రవర్తన కొన్ని సందర్భాల్లో చాలా హాస్యాస్పదంగా ఉంటోం దంటాను."

"మీరు ఏ విషయం గురించి మాట్లాడుతున్నారో గ్రహించాను. కాస్త ఎక్కువ జాగ్రత్త తీసుకుంటే కనిపించినవాళ్ళనల్లా అనుమానిస్తున్నామంటారు. లేకపోతే, బాహాటంగా తిరుగుతున్న కమ్యూనిస్టుల్ని పట్టుకోటానికి పోలీసు వాళ్ళకి చాతకావడం లేదంటారు."

"అదలా ఉంచండి. అసలు పోలీసువాళ్ళు మర్యాద నేర్చుకోవాలండీ! నైతికంగా వాళ్లలో

గొప్ప విప్లవం రావాలి" అన్నాను, నిర్మొహమాటంగా.

"నేను గౌరవంగా మాట్లాడటం లేదా?" సూపరింటెండెంటు నవ్వి అన్నాడు. "దళంలో చేరేముందు వాళ్లూ పౌరులే. అప్పుడు వాళ్లూ ఇలా అన్నవాళ్లే."

"వృత్తితో పాటు మనసు మారుతూ ఉంటుంది కాబోలు."

"పరిస్థితుల ప్రాబల్యం. దృక్పథం మారటానికి తగినంత అవకాశం ఏర్పడలేదు వాళ్ళకి. వాళ్ళ అవసరం ప్రజలకి తగ్గకపోగా ఎక్కువవుతోంది- అర్థం చేసుకున్నారనుకుంటాను."

"ఊఁ- కాని నే ననేది కనీసం మర్యాదగా ప్రవర్తించటమయినా-"

"అది ప్రజల చేతుల్లోనే ఉంది. సైనిక విప్లవం అంటున్నారే. అది రావలసింది ముఖ్యంగా ప్రజానీకంలో. ప్రజా మారకపోతే విధి మారదు. మారినా ప్రయోజనం లేదు." స్వరం తగ్గించి అన్నాడు. "కావాలని నెత్తి నెక్కించుకుని బరువుగా ఉందంటే ఏం లాభం?- మార్పు సమానంగా రావాలి. మేం మారినా మీరు మారకపోతే ప్రయోజనం శూన్యం. మీరు మారితే మా మార్పు మీచేతుల్లోనే ఉంది."

మెదడులో ఏదో కదుల్తూ ఉంది. కాని నోరు పెకలిరాలేదు. సంతృప్తీ, అసంతృప్తీ సినిమా స్లయిడ్లలా ఒకదాని తర్వాత మరొకటి ద్యోతక మవుతూన్నాయి. సెలవు తీసికొని బయటికి వొచ్చేశాను. చీకటిగా ఉంది. మెరుపులు చూపించిన దారి అనుసరించాను.

గతసంచిక తరువాయి

# హ్యూమనిజం—కమ్యూనిజం

ఆవుల గోపాలకృష్ణమూర్తి

మార్క్స్ దృష్టిలో ఉత్పత్తి, పంపిణీ, మారక సాధనాల్ని సంఘపరం చేసి, ఆసంఘాన్ని శ్రామిక నియంతృత్వపరం చేస్తే అది సోషలిజమౌతుంది. ఉత్పత్తి, పంపిణీ, మారకాల్లో వ్యక్తుల జోక్యం, పెత్తనం లేకుండా వుంటే అది స్వర్గధామంగా వుంటుంది. సర్వం మానవుని శ్రమ ఫలితమనీ, శ్రమే సర్వానికీ మూలమనీ, ప్రతి విలువను నిర్ణయించేది యీ శ్రమని బట్టేననీ అంటాడు. దీన్నే "లేబర్ వ్యాల్యూ" అంటాడు. శ్రమించేవాడికి యివ్వక దాచుకొని అదనపు లాభాన్ని కాజేస్తారు గనక, యీ 'అదనపు విలువ' ప్రయివేటు ఆస్తికి మూలమని అంటాడు. ఇది మార్క్సిజంలో గొప్ప సిద్ధాంతం. నిజానికి యిది సత్యంలో ఒక భాగం. కాని యీ సూత్రాన్నిబట్టి ఆస్తిఅంతా 'దొంగతనమే' నన్న బందిపోటు సిద్ధాంతాన్ని లేవదీశారు.

అదనపు విలువ లేందీ అభివృద్ధి వుండదు. మానవుడు సృష్టించింది కాస్తే, ప్రతిక్షణం గుటకవేస్తే మిగిలేది లేదు; మిగిలేది లేందీ అభివృద్ధి లేదు. ఈనాడు సోవియట్ ఆర్థికవిధానం తీయండి. అదనపు విలువను కోటానకోట్లు తిరిగి ఉత్పత్తిలోకి మార్చినమూలంగానే ఆదేశంలో అభివృద్ధి కలుగ వీలైంది. అభివృద్ధి యెంత పెరిగితే, అంత అదనపుశక్తి, ఆదాయం తిరిగి రాజ్యాంగంలోకి వచ్చినట్టే. అందువల్ల మార్క్స్ చెప్పే అదనపు విలువ సిద్ధాంతం ఆచరణయోగ్యం కాదనీ, రష్యా అనుభవం యీ సిద్ధాంతాన్ని త్రోసివేసిందనీ హ్యూమనిస్టు లంటారు. అదీగాక, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థానిర్మాణంలో వున్న రూళ్లకర్ర పద్ధతి, అంత దిగ్బంధన విధానం స్వేచ్ఛకు చాలా భంగమనీ వాదిస్తారు.